క్లుప్తంగా

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉపాధి


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ఆలూరు రూరల్: జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి లభిస్తుందని ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించగా 48 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి నవభారత్ ఫర్టిలైజర్స్, అమరరాజా గ్రూప్స్ ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. ఇందులో 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వీరేష్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలన ఉంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

గోపూజతో సకల సౌభాగ్యాలు


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : గోపూజ చేస్తే వారి ఇంట సకల సౌభాగ్యాలు కలుగుతాయని దేవాలయ కార్య నిర్వహణాధికారి వీరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు రంగస్వామి గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రంగనాథస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. డాక్టర్ దేవి దయానద్‌సింగ్, డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


అనాథలకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం అనాథ వృద్ధులు, నిరుపేదలకు ఆదోని వివేకనంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రవికాంత్, శ్రీధర్‌శెట్టి తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కెర ఇతర సరుకులు అందజేశారు.

పరామర్శ

కృష్ణగిరి: ఇటీవల తెలంగాణ రాష్ట్రం, తిమ్మాపూర్ వద్ద వలస వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ సుజాతను మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. పనుల్లేక వలస వెళ్లిన వీరి కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం చిన్నాభిన్నం చేసిందన్నారు. కాగా..ఈ ప్రమాదంలో బాధితురాలి కుమార్తె మమత మృతి చెందింది. గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, తెలుగు డిష్ వెంకటేష్, భంభం బాషా ఉన్నారు.

నేడు కప్పట్రాళ్లకు ఐజీ ఆకె రవికృష్ణ రాక

దేవనకొండ: మండలంలోని కపట్రాళ్ల గ్రామానికి ఐజీ ఆకె రవికృష్ణ శనివారం రానున్నారని గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామంలో గ్రామస్తులతో సమావేశమవుతారని చెప్పారు.

నేడు హొళగుందకు ఎమ్మెల్యే రాక

హొళగుంద: మండల కేంద్రం హొళగుందకు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి శనివారం రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. జెడ్పీ వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు, ఎంటీపీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

- తంగరడోణలో రుచీ పచీ లేని వంట
- ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తున్న విద్యార్థులు
- అధికారుల పర్యవేక్షణ లోపం


తంగరడోణలో అన్నం పెట్టించుకుంటున్న విద్యార్థులు


ముద్దగా ఉన్న అన్నం, నీళ్ల చారులా ఉన్న ఆకు కూర పప్పు వడ్డించిన దృశ్యం

ఆస్పరి: అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా మారింది. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించడం లేదనే ఆరోపణలో ఉన్నాయి. ముద్దగా మారిన అన్నం తినలేక చాలా మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వస్తున్నారు. మండలంలోని తంగరడోణ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వచ్చారు. పాఠశాలలో 3–10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం 450 మంది విద్యార్థులకు గాను 220 మంది హాజరయ్యారు. మెనూ ప్రకారం ఆకు కూర పప్పు, గుడ్డు, చిక్కీ ఇవ్వాలి. అయితే వంట నిర్వాహకులు నీళ్ల చారు, ముద్దగా ఉన్న అన్నం పెట్టారు. ఆకు కూర పప్పు నీళ్ల చారులా ఉంది. దీంతో ఆ భోజనం విద్యార్థులు తినలేకపోయారు. కొంత మంది పక్కన పడవేశారు. వంట నిర్వాహకులు భోజనం సరిగా చేయడం లేదని విద్యాశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా భోజనం పెడుతున్నారని చెబుతున్నారు. వంట నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం ఎంఈఓ తిరుమల రావు దృష్టికి తీసుకెళ్లగా భోజనం నాణ్యతగా లేదనేది తమ దృష్టికి రాలేదని, మధ్యాహ్న భోజనం సరిగా చేయకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెనూ పాటించాలి


పెరవలిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

మద్దికెర : డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం ప్రకటించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ సూచించారు. శుక్రవారం పెరవలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినేలా వంటలు వండించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరు బుక్‌ను పరిశీలించారు. చిన్నారులకు ఆటలతో పాటు విద్య బోధించాలని సూచించారు. తహసీల్దార్ హుసేన్ సాహెబ్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


మధ్యాహ్న భోజనాన్ని తింటున్న ఎంఈఓ-2 రమేష్

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎంఈఓ–2 రమేష్ అన్నారు. మండలంలోని సూదేపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మోనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వంట చేసే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


ఆలూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి


పత్తికొండలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వెల్దుర్తి బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలూరు రూరల్: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని నిర్మించేందుకు అంబేడ్కర్ అహర్నిశలు శ్రమించారన్నారు. పార్టీ కో–కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, నాయకులు ఎల్లప్ప, మల్లికార్జున, జే.వీరేష్, రొక్కప్ప,మల్లయ్య, వరుణ్,బాబు ఉన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కారం నాగరాజు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు నెట్టేకల్లు, ఎస్టీ సెల్ నాయకుడు భాస్కరనాయక్ తదితరులు పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు రంగానాయక్, లక్ష్మీనాయక్, పెద్దహుల్తి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు కేశప్ప, గణపతి, నాయకులు బనగానికి శ్రీనివాసులు, గొర్ల మోహన్, రవికుమార్, దొరస్వామి, శ్రీనివాసులు, బాలు, రంగన్న పాల్గొన్నారు.

హాలహర్వి: అంబేడ్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఎమ్మార్పీఎస్ పత్తికొండ డివిజన్ అధ్యక్షుడు గూళ్యం ఎల్లప్ప మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హొళగుంద: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిద్ధార్థ ప్రైవేటు పాఠశాలలో కరెస్పాండెంట్ చిదానంద, టీచర్లు, విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు మాసపోగు బజారు, నాయకంటి గిడ్డయ్య మాదిగ, మాజీ జెడ్పీటీసీ ఐజయ్య మాదిగ, సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ..


అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న విరూపాక్షి

ఆలూరు రూరల్: స్థానిక ఉపాధ్యాయ నగర్‌లోని సాయి బాబా దేవాలయం ఎదుట నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్ నాయక్, చిత్రంలో హార్టికల్చర్ పీడీ ఉమాదేవి


చిన్నహ్యాటలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న డీపీఓ భాస్కర్

పత్తికొండ(తుగ్గలి) : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్ అన్నారు. శుక్రవారం హోసూరులో తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన అర్జీలను ఆర్డీఓ పరిశీలించారు.

తుగ్గలిలో..

తుగ్గలి మండలం బొందిమడుగులలో తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన రెవెన్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

మద్దికెర : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ హార్టికల్చర్ పీడీ ఉమాదేవి, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

స్పందన కరువు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులకు స్పందన కరువైంది. శుక్రవారం మండలంలోని మనేకుర్తి గ్రామంలో తహసీల్దార్ గోవింద్ సింగ్, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం 5 అర్జీలు మాత్రమే వచ్చాయి. ఇందులో 3 మ్యుటేషన్ (అడంగల్‌లో మార్పులు,చేర్పులు) కోసం జేడీ లక్ష్మి, కొల్లమ్మ, నాగరాజు అనే రైతులు అర్జీలు అందించారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు అర్జీ అందించారు. ఆన్‌లైన్ అడంగల్‌లో పట్టా భూమికి బదులు ప్రభుత్వ భూమిగా నమోదైందని లక్ష్మమ్మ అనే మహిళా రైతు అర్జీ అందించినట్లు తహసీల్దార్ తెలిపారు.

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వీఆర్‌ఓ మల్లికార్జున,పంచాయతీ కార్యదర్శి నాయక్,సర్వేయర్లు పాల్గొన్నారు.

హాలహర్వి: సమస్యలు ఉన్న ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నజ్మాబాను అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్ధాపురం, అమృతాపురం, బల్లూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు.

హొళగుంద: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకధికారి, డీపీఓ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నహ్యాట గ్రామంలో సర్పంచ్ హేసన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆన్‌లైన్ అడంగళ్లలో విస్తీర్ణంకు సంబంధించి సమస్యలు, భూముల క్రయ విక్రయాల ఇబ్బందులు తదితర వాటి గురించి రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని సూదేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంకుమార్ పాల్గొని మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి తులసీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మిరాజు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 62 దరఖాస్తులు వచ్చినట్లు వచ్చినట్లు వారు తెలిపారు.

రెండు అర్జీలు మాత్రమే..

దేవనకొండ: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కరువైంది. కేవలం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. మండలంలో అత్యధికంగా భూ సమస్యలు ఉన్నా..ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోయారు.

నేడు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

పత్తికొండ(తుగ్గలి) : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పేరెంట్ డే) పండుగ వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పత్తికొండ, తుగ్గలి ఎంఈవో–2లు రమేష్, రమావెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో భాగంగా ప్రతి విద్యార్థికి సమగ్ర ప్రగతి పత్రం (హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డు) అందజేస్తామన్నారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చిన దాతలు, పూర్వవిద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సమావేశంలో భాగస్వాములవుతారని చెప్పారు.

ఉపాధ్యాయురాలి మృతిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరాములు శుక్రవారం తెలిపారు. స్థానిక షరాఫ్‌బజార్‌లో నివాసముంటున్న శివప్రకాష్ భార్య భారతి (45) గురువారం ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు గురిచేయడం, అనారోగ్య కారణాలతో భారతి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆమె తండ్రి అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

9న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 9వ తేదీన జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ బాలబాలికల టోర్నమెంట్–కమ్– సెలెక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రి పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 2008 తరువాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

వక్ఫ్ బోర్డులో కర్నూలును విస్మరించడం దారుణం

కర్నూలు (అర్బన్): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీలో కర్నూలు జిల్లాకు స్థానం కల్పించకపోవడం దారుణమని వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నియమించబడిన కమిటీ పట్ల ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల ముస్లిం సమాజం తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధిక వక్ఫ్ ఆస్తులు కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మరోసారి పునరాలోచించాలని, అలాగే వక్ఫ్ రక్షణ ఫోరం రాయలసీమ జోనల్ కార్యాలయాన్ని కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సంబంధించి అత్యధిక ముతవల్లీలు కర్నూలు జిల్లాలో, రాయలసీమ ప్రాంతంలో ఉన్నారన్నాని పేర్కొన్నారు.



గుంతలు పడి అధ్వానంగా మారిన సుళువాయి బైపాస్ రోడ్డు

రోడ్డును బాగు చేయరూ!

హొళగుంద: మండలంలోని సుళువాయి గ్రామం వద్ద ఉన్న బైపాస్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో ప్రయాణం నరకాన్ని చూపుతోంది. అటు ఆలూరు ఇటు హొళగుందకు వచ్చే వాళ్ల సుళువాయి గ్రామం మీదుగా కాకుండా బైపాస్ రోడ్డులో వస్తే ప్రయాణ దూరం తగ్గుతుంది. దీంతో చాలా మంది వాహన చోదకులు ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. అయితే రోడ్డు మోకాలోతు గుంతలు పడి, రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్తున్నారు. ఈ రోడ్డును బీటీ రోడ్డుగ మారిస్తే సమయం, దూరం తగ్గుతుందని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే.. హొళగుంద నుంచి సమ్మతగేరి క్రాస్ వరకు రోడ్డు పూర్తి శిథిలమైంది. దేవరగట్టుకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బారిక మల్లికార్జున జాతీయస్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఇందిరాదేవి, ఫిజికల్ డైరెక్టర్ జి.రామన్న తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థి మల్లికార్జునను అభినందించారు. వారు మాట్లాడుతూ.. గత నెలలో బాపట్ల జిల్లాలో అండర్–14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మల్లికార్జున కర్నూలు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో త్వరలో మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. క్రీడాకారుడు మల్లికార్జున జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

విలువిద్య పోటీల్లో సత్తా

కర్నూలు (టౌన్): విజయవాడ పట్టణంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన సీనియర్ స్త్రీ, పురుషుల రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో కర్నూలుకు మూడవ స్థానం దక్కింది. కర్నూలుకు చెందిన సాయి గీతిక ఈ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించిన ఈ క్రీడాకారిణి ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జంషెడ్‌పూర్‌లోని టాటానగర్ పట్టణంలో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా విలువిద్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరత్నమయ్య శుక్రవారం వెల్లడించారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పలువురు క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

11న వేలం

మద్దికెర : మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఏడాది పాటు టెంకాయలు, తమలపాకులు అమ్ముకునేందుకు దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో సీల్డ్ కొటేషన్, బహిరంగ వేలం ఈనెల 11వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఆలయ ఆవరణలో వేలాలు నిర్వహిస్తామని ఈఓ వీరయ్య శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల పాటదారులు రూ.50 వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

రమణీయం.. చెన్నకేశవ స్వామి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- నేడు కుడుములాటతో ముగియనున్న ఉత్సవాలు


మొలగవల్లిలో భక్తుల నడుమ రథాన్ని లాగుతున్న దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో కొలువైన చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. ఉదయం చెన్నకేశవ స్వామి, లక్ష్మీ సమేత భూదేవి కల్యాణోత్సవాన్ని గ్రామస్తుల నడుమ ఆలయ అర్చకులు ప్రభుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే.. స్వామి వారికి గంగ పూజ, పంచామృతాభిషేకం, మహామంగళ హారతి వంటి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం 7 గంటలకు భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. అలాగే ఆలయంలో కొలువైన రుక్మిణీ పాండురంగ, ఆంజనేయ స్వామి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. రథోత్సవాన్ని తిలకించడానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలూరు సీఐ వెంకటచలపతి,ఎస్ఐ దిలీప్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కుడుములాట..

చెన్నకేశవ స్వామి,లక్ష్మీసమేత భూదేవిలను గ్రామస్తుల సమక్షంలో నేడు శనివారం హనుమద్వాహనం, అశ్వవాహనం, గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నారు. అంతకు ముందు గ్రామస్తులు సద్దలతో తయారు చేసిన కుడుములను ఇరు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విసురుకోనున్నారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి.

షష్ఠి ఉత్సవాలు ప్రారంభం


శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి


హోమం నిర్వహిస్తున్న పండితులు

మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు కట్ట మీద వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ముందుగా శ్రీవల్లి, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి పూజ, కుంకుమార్చన, స్కంద హోమం, మహా మంగళహారతి, హోమాలు నిర్వహించారు. తదనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను, చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో మేళతాళాలు, బాణాలు పేల్చుకుంటూ ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులుపాల్గొన్నారు.